క్లుప్తంగా

కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి చర్యలు

నాగోలు: కొత్తపేట డివిజన్‌లోని కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నానని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. ఆదివారం కొత్తపేట డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో ఉన్న వివిధ సమస్యలను పరిశీలించారు. కాలనీలో వరద నీటి సమస్య, డ్రైనేజీ సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. కాలనీవాసులు సంజీవ్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కటకటాల్లోకి కాలర్ ఇమ్రాన్


కాలర్ ఇమ్రాన్

చంచల్‌గూడ: వివాదాస్పద వ్యాఖ్యలు, వీడియోలతో నిత్యం వార్తల్లో ఉండే రౌడీషీటర్ మహ్మద్ ఇమ్రాన్ అలియాస్ కాలర్ ఇమ్రాన్‌ను మాదన్నపేట పోలీసులు కటకటాల్లోకి పంపారు. సీఐ సునీల్ తెలిపిన వివరాల ప్రకారం... ఇమ్రాన్ కాలాపత్తర్ పీఎస్ పరిధిలో రౌడీషీటర్. ఇతను ఒక రౌడీషీటర్ విషయమై మాదన్నపేట ఎస్ఐ శోభకు గత నెల 31న ఫోన్ చేసి విధులను అడ్డుకునే విధంగా ఇష్టం వచ్చినట్లు మాట్లాడాడు. ఇమ్రాన్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన పోలీసులు గత శనివారం అతడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు తరలించగా 10 రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ సునీల్ తెలిపారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ కవిత



మన్సూరాబాద్: బీఆర్ఎస్ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి ముద్దగోని రామ్మోహన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ ముద్దగోని లక్ష్మీప్రసన్నగౌడ్ కుమారుడు రంజిత్‌గౌడ్–హేమలత వివాహమహోత్సవ వేడుకలు ఆదివారం మన్సూరాబాద్‌లోని కేబీఆర్ కన్వెన్షన్‌లో ఘనంగా జరిగాయి. రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి జోగి రమేష్, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మైనంపల్లి హనుమంతరావు, జైపాల్‌యాదవ్, మాజీ ఎంపీలు మధుయాష్కి, వి.హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

యాదవ మహాసభ నాగోలు డివిజన్ కమిటీ ఎన్నిక


అఖిల భారత యాదవ మహాసభ నూతన కమిటీ సభ్యులు


నాగోలు: అఖిల భారత యాదవ మహాసభ నాగోలు డివిజన్ కమిటీ సమావేశం ఆదివారం నాగోలు శుభం కన్వెన్షన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన యాదవ సంఘం నాయకులు చింతల సురేందర్ యాదవ్, గొల్ల సతీష్ యాదవ్, చింతల మహేందర్ యాదవ్ సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నాగోలు డివిజన్ అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షుడిగా చింతల కిరణ్‌కుమార్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా సునీల్ కుమార్, బి.సతీష్, జె.శివకుమార్, శ్రీను, ధనేష్, ప్రధాన కార్యదర్శిగా గొల్లకృష్ణ, సహాయ కార్యదర్శిలుగా గణేష్, సందీప్, శ్రీశైలం, కోశాధికారిగా జనార్దన్, సహాయ కోశాధికారిగా భారత్ యాదవ్‌తో పాటు ఇతర పదవులకు పలువురిని ఎన్నుకున్నారు.

ప్రణాళికాబద్ధంగా పార్కుల అభివృద్ధి


ఎస్‌బీహెచ్ ఆఫీసర్స్ కాలనీ పార్కులో అభివృద్ధి పనులు ప్రారంభించిన కార్పొరేటర్

సైదాబాద్: పార్కుల్లో పచ్చదనం పెంచడం ద్వారా వాటిల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంటోందని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని ఎస్‌బీహెచ్ ఆఫీసర్స్ కాలనీ పార్కులో ఇంటర్ లాకింగ్ టైల్స్ ఏర్పాటు తదితర అభివృద్ధి పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ఐఎస్ సదన్‌లోని అన్ని కాలనీల్లోని పార్కులను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. పార్కుల్లో పచ్చదనం పెంపుతో పాటు వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు నారాయణరెడ్డి, శ్రీనివాస్, రఘు, సోమయ్య, సుధీర్, ప్రసాద్ పాల్గొన్నారు.

మలక్‌పేట ఎవరికో?



- బీజేపీ టికెట్ కోసం నలుగురు నాయకుల మధ్య పోటీ
- పోటాపోటీ కార్యక్రమాలతో నిత్యం బిజీ
- అందరిలోనూ గెలుపు ధీమా

సైదాబాద్: తెలంగాణలో గెలుపే ధ్యేయంగా వ్యూహాలు రచిస్తున్న బీజేపీ పాతబస్తీలోనూ పాగా వేయడానికి సిద్ధమవుతోంది. పాతబస్తీలో ముఖ్యంగా మలక్‌పేట నియోజకవర్గంలో పార్టీ గెలుపును అగ్రనాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. ఉమ్మడి మలక్‌పేట నియోజకవర్గం గతంలో బీజేపీకి కంచుకోటగా ఉండేది. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం కొత్త మలక్‌పేట నియోజకవర్గంలో గత మూడుసార్లు ఎంఐఎం అభ్యర్థి గెలుస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో రెండు డివిజన్లలో బీజేపీ ప్రజాప్రతినిధులు ఉండగా, మిగిలిన డివిజన్లలోనూ పార్టీ క్యాడర్ బలంగా ఉంది. ఈ నేపథ్యంలో మలక్‌పేటలో ఈసారి ఎలాగైనా పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలని కార్యకర్తలు సైతం పట్టుదలతో ఉన్నారు. మలక్‌పేట నుంచి అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగేందుకు నలుగురు నాయకులు తీవ్రంగా పోటీ పడుతున్నారు. ఎవరికి వారు పార్టీలోని తమ గాడ్‌ఫాదర్‌ల ఆశీస్సులతో పార్టీ టికెట్ తమకే దక్కుతుందని నమ్మకంతో ప్రయత్నాలు సాగిస్తున్నారు. నిత్యం పార్టీ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలతో టికెట్ సాధనే లక్ష్యంగా పనిచేస్తున్నారు.

జిల్లా అధ్యక్షుడిని టికెట్ నాకే...

సంరెడ్డి సురేందర్‌రెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు



బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న సంరెడ్డి సురేందర్‌రెడ్డి ఈసారి మలక్‌పేటలో పార్టీ టికెట్ తనకే దక్కుతుందని ఘంటాపథంగా చెప్తున్నారు. జిల్లా పరిధిలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో పార్టీ పటిష్టతకు తీవ్రంగా కృషి చేస్తున్నానని, అందుకే తనకు పార్టీ అవకాశం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ సీనియర్ నేత, తన గాడ్‌ఫాదర్ అండతో తనకే టికెట్ వస్తుందని ఆయన నమ్ముతున్నారు.

సుదీర్ఘ అనుభవం ఉన్న నాకే అవకాశం...

సుభాష్‌చందర్జీ, మాజీ డిప్యూటీ మేయర్



బీజేపీ నగర విభాగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న తనకు చివరి అవకాశంగా మలక్‌పేట నియోజకవర్గం నుంచి పార్టీ టికెట్ కేటాయిస్తుందని నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ నమ్మకంగా ఉన్నారు. 1986లోనే అప్పటి జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సైదాబాద్ డివిజన్ నుంచి ఆయన బీజేపీ నుంచి నిలిచి కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2002లోనూ మరోసారి బీజేపీ నుంచి సైదాబాద్ కార్పొరేటర్‌గా గెలిచి డిప్యూటీ మేయర్‌గా పనిచేశారు. అగ్రనాయకుల అండదండలతో పాటు నగర పార్టీలో అత్యంత సీనియర్ అయిన తనకు పార్టీ అవకాశం కల్పిస్తుందని ఆయన ధీమాగా ఉన్నారు.

'బీసీ యువ నాయకుడిగా నాకే టికెట్...

లింగాల హరిగౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు



మలక్‌పేట నియోజకవర్గ ఎన్నికల్లో గతంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి నిలిచిన అనుభవంతో పాటు, బీసీ యువ నాయకుడిని అయిన తనకే పార్టీ టికెట్ గ్యారెంటీ అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్ ఆత్మవిశ్వాసంగా ఉన్నారు. మలక్‌పేట నియోజకవర్గ పరిధిలో 25 సంవత్సరాలుగా అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో సత్సంబంధాలు ఉన్న తనకు అవకాశం వస్తే మలక్‌పేటలో తొలిసారి బీజేపీ జెండా ఎగురవేస్తానని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. మలక్‌పేట నియోజకవర్గ బీజేపీ టికెట్ విషయంలో పార్టీ అధిష్టానం లింగాల హరిగౌడ్‌కే మొగ్గు చూపిస్తున్నదని పార్టీ కార్యకర్తలు అనుకుంటున్నారు.

గెలుపు గుర్రాన్ని నేనే...

కొత్తకాపు రవీందర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు



ఎంఐఎం పార్టీని నిలువరించి మలక్‌పేటలో బీజేపీని గెలిపించే గులుపు గుర్రంగా పార్టీ తనకే టికెట్ ఇస్తుందని కొత్తకాపు రవీందర్‌రెడ్డి నమ్మకంతో ఉన్నారు. సాధారణ బ్యాంక్ ఉద్యోగిగా, వాలీబాల్ జాతీయ క్రీడాకారుడిగా తన ప్రస్థానం మొదలు పెట్టిన ఆయన మొదట్లో కాంగ్రెస్‌లో ఉండి కొంతకాలం క్రితం బీజేపీలో చేరారు. సైదాబాద్ డివిజన్ ఎన్నికల్లో తన సతీమణికి పార్టీ టికెట్ ఇప్పించుకొని గెలిపించుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లోనూ తనకు పార్టీ టికెట్ కేటాయిస్తే గెలిచి తానేంటో నిరూపిస్తానంటున్నారు.

ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ నూతన కమిటీ నియామకం

హయత్‌నగర్: ఎల్‌బీనగర్‌లోని ప్రసన్నాంజనేయ ఆలయ నూతన కమిటీని ప్రభుత్వం నియమించింది. మొత్తం 15 మంది సభ్యుల గల ఈ కమిటీలో ప్రవీణ్‌కుమార్, నాంపల్లి నాగేశ్వర్‌రావు, ఆర్ల వెంకట్‌రెడ్డి, సన్నిధి నవీన్‌రెడ్డి, చింతల శ్రీధర్, మురుగం అనిల్‌కుమార్, జాలం రమేష్‌యాదవ్, గలిగరి ప్రవీణ్‌కుమార్, అనుగుల బీరయ్య, కొల్లు లక్ష్మి, గుంటి రవీందర్, అర్ల రాజు, రాసమల్ల శోభారాణి, తోర్పునూరి అనిల్‌కుమార్, అందేకార్ ఇంద్రాజీ ఉన్నారు. వీరి పదవీ కాలం ఆరు నెలల ఉంటుంది.

కొత్తపేట గణేష్ నిమజ్జన ఉత్సవ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని కొత్తపేట గణేష్ నిమజ్జన ఉత్సవ కమిటీ –2023ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్తపేట పీవీటీ మార్కెట్ వద్ద నుంచి గణేష్ నిమజ్జనానికి భారీగా తరలి వెళ్లే గణనాథులకు స్వాగతం పలికే కమిటీని సభ్యులందరి ఆమోదంతో ఎన్నుకున్నారు. చైర్మన్‌గా చిలుక ఉపేందర్ రెడ్డి, అధ్యక్షుడిగా ఫౌండర్ అధ్యక్షుడుగా గట్ల రవీంద్ర(హైటెక్ రామ్), ముఖ్య సలహాదారులుగా నల్లెంకి ధనరాజ్ గౌడ్, ఏవీ రావు, పి.ఆనంద్ కుమార్, సురేంద్ర కుమార్, కృష్ణారెడ్డి, వినోద్ కుమార్, అముదా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా తలాటి రమేష్ నేత, కోశాధికారిగా రాళ్లబండి హనుమంతరావు, ఉపాధ్యక్షులుగా మురళి (చిన్న), చౌకీ సుమన్, మామిడి రామకృష్ణ గౌడ్, శేఖర్ ముదిరాజ్, వంగాల శ్రీకాంత్ రెడ్డి, అక్బర్, కల్యాణ్ యాదవ్, నబీ, దినేష్ సింగ్ తో పాటు ఆర్గనైజింగ్ కార్యదర్శులను, జాయింట్ సెక్రటరీ తదితరులను ఎన్నుకున్నారు.

పనిచేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టండి

జీహెచ్ఎంసీ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం


హస్తినాపురంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: హస్తినాపురంలోని సాగర్‌ఎన్‌క్లేవ్ కాలనీలో పనులు నత్తనడకన జరుగుతున్నాయని, పనిచేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హస్తినాపురం డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై జీహెచ్ఎంసీ అధికారులతో ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్న ఉద్దేశంతో యుద్ధప్రాతిపదికన కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తే కొంత మంది కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పనులను సకాలంలో పూర్తి చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అలాంటి వారిని ఎట్టిపరిస్థితిలో ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. సాగర్‌ఎన్‌క్లేవ్ కాలనీ నుంచి కేకే గార్డెన్స్ వరకు వెళ్లే దారిలో మూలమలుపు వద్ద గుంత తవ్వి దాదాపు 10 నెలలు గడుస్తున్నా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఆయన అధికారులను పిలిపించి పనులను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. మూడు రోజుల్లో పనులను ప్రారంభించకపోతే సదరు కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి, మరొకరికి ఆ పనులు అప్పగించి పూర్తి చేయించాలని సుధీర్‌రెడ్డి ఆదేశించారు. అంతేకాకుండా పిండిపుల్లారెడ్డి నుంచి ఈదులకంటి గార్డెన్ వరకు నూతన రోడ్డు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని సూచించారు. సమావేశంలో ఎస్ఈ అశోక్‌రెడ్డి, డీఈలు కోటేశ్వరరావు, కనకయ్య, ఏఈ హేమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

శివారు కాలనీల అభివృద్ధికి పెద్దపీట

ఎల్‌బీనగర్: నియోజకవర్గంలోని శివారు కాలనీల ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయనున్నట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని 21 శివారు కాలనీల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. శివారు కాలనీల అభివృద్ధికి నిధులు వరదలా వస్తాయని తద్వారా కాలనీలు శరవేగంగా అభివృద్ధి జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. శివారు ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు 18 కిలో మీటర్ల మేర పైప్‌లైన్లు వేసేందుకు రూ.16 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, నాయకులు అనిల్‌చౌదరి, రాఘవేందర్‌రావు, ముద్దగోని సుమన్‌గౌడ్, సరస్వతి, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కాలనీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తా: కొప్పుల

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలోని నందిహిల్స్ కాలనీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. నందిహిల్స్ కాలనీలో ఆయన ఆదివారం పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ, కాలనీలో మంచినీటి, డ్రైనేజీ సౌకర్యం కల్పించానని తెలిపారు. కమ్యూనిటీహాల్ నిర్మాణం త్వరలో చేపడతామన్నారు. సీసీ రోడ్ల నిర్మాణానికి అంచనాలు రూపొందించామని, త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తానని అన్నారు. 20 వేల లీటర్ల నీరు ఉచితంగా ఇస్తామని గ్రేటర్ ఎన్నికల్లో తెలిపారని, నేడు మంచినీటి బిల్లులు చెల్లించాలని జలమండలి అధికారులు కాలనీవాసులపై ఒత్తిడి చేయటం సబబుకాదన్నారు. కాలనీవాసులు మంచినీటి బిల్లులు చెల్లించవద్దని, అధికారులు ఒత్తిడి చేస్తే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు యాదయ్య, ఖలీల్, జీవన్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, జనార్దన్‌రెడ్డి, జంగయ్యయాదవ్, విజయ్‌కుమార్ నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, కదారి యాదగిరియాదవ్ పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల సేవలు వెలకట్టలేనివి


ఆత్మీయ సమ్మేళనం పోస్టర్‌ను విడుదల చేస్తున్న వకుళాభరణం కృష్ణమోహన్‌రావు తదితరులు

నాగోలు: నాయీ బ్రాహ్మణ (మంగలి) కులస్తుల సేవలు వెలకట్టలేనవని, సమాజం వారికి ఎప్పటికీ రుణపడి ఉంటుందని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు అన్నారు. కొత్తపేటలోని బాబూజగ్జీవన్ భవన్‌లో ఈనెల 5న నిర్వహించనున్న ఎల్‌బీనగర్ దశాబ్ది ఉత్సవ నాయీ బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వకుళాభరణం మాట్లాడుతూ, సేవా వృత్తిలో ఉండి మంగలి కులస్తులు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు విశేషంగా సేవలందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు రాసమల్ల బాలకిషన్, ప్రధాన కార్యదర్శి పెంబర్తి శ్రీనివాసులు, ఆత్మగౌరవ ట్రస్ట్ చైర్మన్ దుగ్యాల అశోక్ కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి

చంపాపేట: కర్మన్‌ఘాట్‌లోని శ్రీధ్యానాంజనేయ ఆలయంలో ఆదివారం సంకష్టహర చతుర్థి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చరణలతో గణపతి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు బబూరి ఆనంద్ కుమార్, నారగోని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

హైదరాబాద్ రేస్ క్లబ్‌లో సెలబ్రిటీల సందడి


గోపిరావుతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న లక్ష్మి మంచు

మలక్‌పేట: మలక్‌పేటలోని హైదరాబాద్ రేస్ క్లబ్‌లో సినీనటి లక్ష్మి మంచు, పలువురు సెలబ్రిటీలు సందడి చేశారు. రేస్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన రేస్ 2 విన్ డెక్కన్ కోల్ట్స్ ఛాంపియన్ షిప్ స్టేక్స్‌కు ఆమె హోస్ట్‌గా విచ్చేశారు. ఈ సందర్భంగా ఫొటోలకు ఫోజులిచ్చారు. అనంతరం రేస్ 2 విన్.కామ్ వ్యవస్థాపకుడు వై.గోపిరావుతో కలిసి లక్ష్మి మంచు మీడియాతో మాట్లాడారు. చిన్ననాటి నుంచి తనకు గుర్రాలు అంటే చాలా ఇష్టమని, గుర్రపు పందెలు వీక్షిస్తున్నానని అన్నారు. బెంగళూరు, ముంబై లాంటి ఇతర ప్రాంతాల్లో జరిగే రేస్‌ల గురించి మాట్లాడుకుంటున్నాం..కానీ హైదరాబాద్ రేస్ క్లబ్ గూర్చి మాట్లాడుకోవడం లేదన్నారు. క్రికెట్‌కు తప్ప ఇతర క్రీడలకు సమయం కేటాయించలేకపోతున్నామని ఆమె అన్నారు. సెలబ్రెటీ శ్రేణిలో లక్ష్మి మంచు, సీరత్ కపూర్, నేహా శెట్టి, అమన్ ప్రీత్, సిద్దూ జొన్నల గడ్డ, యోగితా బిహానీ, శుభ్రా అయ్యప్ప, శ్రుతి చౌహన్, రేస్ క్లబ్ చైర్మన్ ఆర్. సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ బోనాలు


ముత్యాలమ్మ ఆలయంలో బోనాలు సమర్పించిన సామ స్వప్నాసుందర్‌రెడ్డి


మాదన్నపేట మండీలో పోతురాజుల నృత్యాలు

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని దామోదర సంజీవయ్య నగర్ కాలనీలో శ్రావణ మాస బోనాలు ఘనంగా నిర్వహించారు. కాలనీలోని ముత్యాలమ్మ తల్లి, ఈదమ్మ తల్లి ఆలయాలకు ఆలయ కమిటీ సభ్యులు కొత్త రంగులు వేయించి, పూలతో విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆదివారం ఉదయం నుంచే మహిళలు అమ్మవారి ఆలయాలకు బోనాలు ఎత్తుకొని వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నారెడ్డి, బీఆర్ఎస్ యాకత్‌పురా ఇన్‌చార్జ్ సామ సుందర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. స్వప్నారెడ్డి అమ్మవారికి బోనం సమర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మాదన్నపేట మండీలో..

చంచల్‌గూడ: మాదన్నపేట కూరగాయల మార్కెట్‌లో ఆదివారం కూరగాయల వ్యాపారులు బోనాల ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ రుద్ర నర్సింహ ఆధ్వర్యంలో సాయంత్రం భూలక్ష్మి అమ్మవారికి మహిళలు సామూహికంగా బోనాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శివసత్తి జోగిని జగన్ యాదవ్ బోనం ఎత్తి తన నృత్యంతో అలరించారు.

యువజనులు తప్పక ఓటు నమోదు చేయించుకోవాలి


ఓటరు నమోదు కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న ఇంద్రసేనారెడ్డి, కార్పొరేటర్

మలక్‌పేట: మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ నాయకుడు నల్లు ఇంద్రసేనారెడ్డి ఆదివారం స్థానిక నాయకులతో కలిసి మూసారంబాగ్ డివిజన్‌లో ఓటర్ నమోదు కేంద్రాలను సందర్శించారు. ఓటరు నమోదు ప్రక్రియ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువజనులు తప్పకుండా ఓటర్ నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువైందని, ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సండడి సురేందర్‌రెడ్డి, కోశాధికారి రమేష్‌రెడ్డి, వై.సురేందర్, కొప్పుల దినేష్, కొంగర ప్రవీణ్, ఉదయ్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

పార్కు స్థలంలోని పిచ్చిమొక్కల తొలగింపు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని అనంతవేణి నగర్ పార్కు స్థలంలో చెట్లు, చెట్లకొమ్మలు పేరుకుపోయి ఇబ్బందికరంగా ఉందని కాలనీవాసులు డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ఆదివారం పార్కు స్థలంలో పేరుకుపోయిన చెట్లను, పిచ్చిమొక్కలను జేసీబీ సహాయంతో పూర్తిగా తొలగింపజేశారు. దీంతో కాలనీవాసులందరూ కార్పొరేటర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బాల నర్సింహ, అశోక్, రాజేశ్, గట్టయ్య, కాశ్యయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రైవేట్ పీఈటీలకు అండగా ఉంటాం



చంపాపేట: రాష్ట్రంలోని ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయులకు (పీఈటీ) అండగా ఉంటామని రాష్ట్ర ప్రైవేట్ ఉద్యోగుల సంఘం (టీపీయూఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు గంధం రాములు అన్నారు. ఆదివారం చంపాపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో టీపీయూఎస్ ఉపాధ్యాయ విభాగ అధ్యక్షుడు అజయ్ కార్తీక్ సమక్షంలో నిర్వహించిన జిల్లా ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయ కార్యవర్గ ఎన్నికకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన పీఈటీ విభాగ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మల్లేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు సాయికుమార్, సంయుక్త కార్యదర్శులు విశాల్, మల్లికార్జున్, మధుబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి అక్బర్, పవన్ కళ్యాణ్‌లను ఆయన అభినందించారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 17, వంకాయ 18, బెండ 23, పచ్చిమిర్చి 40, కాకర 23, బీర 18, క్యాబేజీ 15, ఫ్రెంచిబీన్స్ 45, క్యారెట్ 35.